


ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కక్కలేక, మింగలేక సతమతం అవుతున్నారు. కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారు. 8లో▸



షూటింగ్ సందడి

ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన బిళ్లసర్గం గుహల వద్ద మంగళవారం సినిమా షూటింగ్‌తో సందడి కనిపించింది. సత్యదేవ్ హీరోగా తెరకెక్కిస్తున్న సినిమా ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.88
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.400
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:36,539
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:39,457

న్యూస్‌రీల్

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. శ్రీశైలంలో అత్యధికంగా 35.4మి.మీ, గోస్పాడులో అత్యల్పంగా 1.0మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా ఆత్మకూరులో 15.8, కొత్తపల్లె 10.4, ప్యాపిలి 9.8, మహానంది 8.2, వెలుగోడు 8.0, కొలిమిగుండ్ల 7.6, గడివేముల 6.8, చాగలమర్రి 5.2, పాములపాడు 4.2, పగిడ్యాల 3.8, మిడుతూరు 3.4, నంద్యాల అర్బన్, బండిఆత్మకూరు 3.2, నందికొట్కూరు 2.6, అవుకు 2.4, బనగానపల్లె 2.2, రుద్రవరం 1.4, నంద్యాల రూరల్, జూపాడుబంగ్లా, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ 1.2 మి.మీ వర్షం కురిసింది.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు



అధికారులు, వైద్యులకు సూచనలిస్తున్న దేవస్థాన ఈఓ

శ్రీశైల టెంపుల్: వర్షాల వలన వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దేవస్థాన అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. క్షేత్ర పరిధిలో ఎక్కడ కూడా చెత్తాచెదారాలు ఉండకుండా విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడా వర్షం నీరు నిల్వ ఉండకుండా ఉండేలా, దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. దేవస్థానం వైద్యశాలలో అవసరమైన అన్నీ మందులను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నరసింహారెడ్డి, ఏఈవోలు, పర్యవేక్షకులు, సిబ్బంది, అపోలో వైద్యులు పవన్‌కుమార్‌రెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు శ్రీవాణి, ఆయుర్వేద వైద్యులు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసింది పులినా.. చిరుతా?



అడవి జంతువు దాడిలో గాయపడిన అంకన్న, చేతిపై ఉన్న గాయాలు

ఆత్మకూరురూరల్: కొత్తపల్లె మండలం చదరంపెంట చెంచు గూడెం పొలాల సమీపంలో సోమవారం చెంచు రైతు అంకన్నపై దాడి చేసిన వన్యమృగం పెద్ద పులినా.. చిరుతనా అనే అనుమానం వ్యక్తమవుతోంది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు మంగళవారం సంఘటన ప్రాంతానికి చేరుకుని వన్యమృగం సంచారంపై ఆరా తీశారు. అయితే ఆ ప్రాంతంలో గడ్డి ఏపుగా పెరగడం, వర్షం కురవడంతో పాద ముద్రలు గుర్తించడం కష్టంగా మారింది. అంకన్నపై పెద్దపులి దాడి చేస్తే పంజా వేటుకు శరీర భాగంలో కండ మొత్తం ఊడి కింద పడే అవకాశం ఉండేది. అతని శరీరంపై గోకుడు గాయాలు, చిన్నపాటి గీతలు మాత్రమే కనిపించడం వారి అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. అంకన్న చేయికి తగిలిన గాయాలను బట్టి చిరుతా లేదా అడవి పంది ఉండవచ్చునేమోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే ఆ యువకుడిపై దాడి చేసింది ఏదో ఒక అడవి జంతువే కాబట్టి, అటవీ చట్టం ప్రకారం తగిన పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రామంజనేయులు కంపెనీల ప్రతినిధులకు సూచించారు. 2025–26లో 550 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 86 హెక్టార్లలో ప్లాంటేషన్ పూర్తయిందన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 13 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అవకాశం ఉందని, సెప్టెంబర్ 15 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కొనసాగుతుందని, ఆలోపు కనీస లక్ష్యంలో 50 శాతం ప్లాంటేషన్ పూర్తి కావాలన్నారు. హెక్టారుకు ప్లాంటేషన్‌కు రూ.29 వేలు, నిర్వహణకు రూ.5250, అంతరపంటల సాగుకు రూ.5250 సబ్సిడీ వస్తుందన్నారు. సమావేశంలో సాంకేతిక ఉద్యాన అధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

కాలం కరుగుతున్నా.. కనికరించరాయే!



ఆళ్లగడ్డ సమీపంలో పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు

కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం అంటూ గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం క్రాప్ కల్టివేటర్ రైట్ (సీసీఆర్) కార్డుల పంపిణీలోనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా సీసీఆర్ కార్డులు దరఖాస్తు దశను కూడా దాటలేదు. మరో వైపు తాము చెప్పిన వారికే కార్డులు ఇవ్వాలని పచ్చ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. మరి కొందరు తమ బంధువులు, అనుచరుల పేరుమీద బినామీ కార్డులు సృష్టించేందుకు వెనుకాడటం లేదు. దిక్కుతోచని కౌలు రైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారు.

- కౌలు రైతులకు తప్పని తిప్పలు
- పంట సాగు హక్కు పత్రాల అందజేతపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా అందని సీసీఆర్ కార్డులు
- కౌలు రైతుల సంక్షేమానికి గత ప్రభుత్వం పెద్దపీట

జిల్లాలో కౌలు రైతులు	50,000 (అంచనా)
కౌలు కార్డుల పంపిణీ లక్ష్యం	45,000
ఇప్పటి వరకు పంపిణీ	5,935

ఆళ్లగడ్డ: ఖరీఫ్ ప్రారంభానికి ముందే (ఏప్రిల్, మే లోపే) సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా ప్రభుత్వ నిర్లక్ష్యం.. అధికారుల సమన్వయ లోపంతో జిల్లాలో ఐదు శాతం కూడా పంపిణీ జరగలేదు. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి భరోసాకు ఈ కార్డే అత్యంత ఆధారం. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ కార్డుల జారీలో కౌలు దారుల గుర్తింపు ప్రక్రియ ఆందోళనకు గురి చేస్తోంది. సుమారు 4 నెలల నుంచి ఈ తంతును అధికారులు సాగదీస్తుండగా.. మరో నెల లోపు సాగు పనులు పూర్తిగా ముగుస్తాయి. సీజన్ దాటాక కార్డులు ఇచ్చినా ప్రయోజనం ఏమిటీ.. అని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు కార్డు అందక.. ఇటు రుణం చేతికి చిక్కక 'పాత కథే' ఈ ఖరీఫ్‌లో పునరావృతమవనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఏరువాక (పంటల సీజన్) మొదలవ్వగానే కౌలు రైతుల గుర్తింపు కార్డుల పంపిణీకి సంబంధించి రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయాలి. కౌలు కౌలు రైతులను గుర్తించడంతో పాటు పొలం యజమానులను ఒప్పించి పొలాలు కౌలుకు ఇచ్చినట్లు ఒప్పంద పత్రం రాయించి ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం వారికి కార్డులు మంజూరు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. కానీ అలాంటి ప్రక్రియ ఎక్కడా జరగడం లేదు. ఈ వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి జిల్లాలో కౌలు రైతులు 50,000 (అంచనా) కాగా సుమారు 45 వేల మంది కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు 5,935 మందికి మాత్రమే పంపిణీ చేసినట్లు సమాచారం. ఇందులో కూడా సగానికి పైగా టీడీపీ నాయకులు తమ బినామీలకు కౌలుకు ఇచ్చినట్లు కార్డులు రాయించినట్లు చర్చించుకుంటున్నారు.

కౌలు రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

రైతులతో పాటు కౌలు దారులకు సైతం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. భూ యజమానుల హక్కులకు ఏమాత్రం భంగం కలుగకుండా కేవలం 11 నెలల కాలానికి సాగు ఒప్పందం చేస్తూ 2011 కౌలు చట్టాన్ని సవరించింది. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి ఒకసారి జారీ చేసిన కార్డును మళ్లీ భూ యజమాని అంగీకరం మేరకు రెన్యువల్ చేసుకునే వీలును కల్పించారు. భూ యజమానుల్లో అపోహలు తొలగించడంతో జిల్లాలో సీసీఆర్‌సీ కార్డుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అసలు రైతుల మాదిరిగానే కౌలు రైతులకు పంట రుణాలు, రాయితీ విత్తనాలు, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పరిహారం అందించి అండగా నలించింది.



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన సీసీఆర్ కార్డు

అంతటా 'పచ్చ'పెత్తనం

ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే కౌలు రైతులకు పెట్టుబడి సాయంగా రూ. 20 వేలు చొప్పున అందజేయడంతో పాటు అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ ఊరూరా తిరిగి ఊదరగొట్టారు. అయితే ఈ సాయాన్ని కాజేసేందుకు 'పచ్చ'తమ్ముళ్లు శతవిధాలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అర్హులకు కార్డులు ఇవ్వకుండా వ్యవసాయాధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. మరికొందరు తమ్ముళ్లు ఇందులో 'మా కేంటి' అంటూ బేరం పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు కాజేయడమే లక్ష్యంగా సీసీఆర్సీలను దర్జాగా పొందేందుకు యత్నిస్తున్నారు. వ్యవసాయమంటే ఏంటో తెలియని అనేక మంది పచ్చ నేతలు తమ ఇళ్లలో పనిచేసేవారు, బంధువులు, అనుచరుల పేరుతో కార్డులు పొందినట్లు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు.

❝ గత ప్రభుత్వానికి రుణపడి ఉంటా



నాకు సెంటు కూడా భూమి లేదు. పదేళ్లుగా పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నా. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో సాధారణ రైతులతో పాటు ఏటా రూ. 13,500 చొప్పున రెండు సార్లు రూ. 27,000 వేలు రైతు భరోసా, రూ. 9 వేలు ఉచిత పంటల బీమా కూడా జమ అయ్యాయి. గత సంవత్సరం నుంచి ఏటా రెండెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ కౌలు కార్డు కోసం అధికారుల చుట్టు ఎన్నిసార్లు తిరిగినా స్పందించడం లేదు.

– ఓబన్న, క్రిష్టిపాడు

ఇప్పుడు ఇచ్చినా ఉపయోగం లేదు



నేను 5 ఎకరాల మేర పొలం కౌలుకు తీసుకుని పూలతోటలు, వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాను. గత నాలుగు సంవత్సరాలుగా జూన్ నెలలోనే కౌలు కార్డులు ఇవ్వడంతో బ్యాంకులో పంట రుణంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలు పొందాను. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు కౌలు కార్డు ఇవ్వలేదు. ఇప్పుడు ఇచ్చినా ఏం ప్రయోజనముండదు. సరిగ్గా సీజన్‌లో అవసరమైన రుణ పరపతి లభించక అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది.

– ఖాదర్ బాషా, చాగలమర్రి

ఇవి ప్రయోజనాలు..

- ➤ సీసీఆర్ కార్డుల వల్ల బ్యాంకుల్లో 7 శాతం వడ్డీతో రుణాలు పొందవచ్చు.
- ➤ క్రమం తప్పకుండా రుణం చెల్లిస్తే సున్నా వడ్డీ వర్తిస్తుంది.
- ➤ పంట నష్టం జరిగినప్పుడు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ పొందుతారు.
- ➤ ఎరువులు, విత్తనాలపై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు పొందవచ్చు.
- ➤ కొన్ని రకాల వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై తీసుకోవచ్చు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

కల్లూరు: పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామంలో టీడీపీకి చెందిన పది కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మంగళవారం తమ్మరాజు పల్లె వైఎస్సార్ సీపీ నాయకులు కోడె శేషయ్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో పది కుటుంబాల సభ్యులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ కాటసాని కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గోవర్ధన్, ఎం. మహేంద్ర, హరిష్, వేణు, శ్రీధర్, కేశవ, మద్దిలేటి, రాజేష్, మహేంద్ర, షేక్షా హుస్సేన్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం కావడంతో పార్టీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఏమి చేశారని సుపరిపాలన

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఏమి చేసిందని సుపరిపాలన అంటూ అధికార పార్టీ నేతలు ఊర్లలో పర్యటిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రశ్నించారు. అధికారం కోసం ప్రజలను మోసం చేసిన చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితమంతా అబద్ధాలేనని విమర్శించారు. 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం బండిఆత్మకూరులో శిల్పా చక్రపాణి పర్యటించారు. సీఎంగా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. హామీలను ఎగ్గొట్టడంలో బాబు ఆరితేరారన్నారు.

– బండిఆత్మకూరు

అటవీశాఖ నిధుల దారి మళ్లింపు కేసులో ఇరువురి అరెస్టు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు డీఎఫ్‌ఓ కార్యాలయంలో నిధుల దారి మళ్లింపు కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల మేరకు.. డీఎఫ్‌ఓ కార్యాలయంలో పర్యవేక్షణ అధికారిగా పని చేసి ఇటీవల రిటైర్డ్ అయిన చాంద్‌బాషా తన ఉద్యోగ కాలంలో పెద్ద మొత్తంలో ప్రభుత్వ నిధులను తన సన్నిహితుల ఖాతాలకు మళ్లించినట్లు గతంలో వెలుగు చూసింది. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు చాంద్‌బాషా సోదరుడైన మగ్బూల్‌బాషా, అనుచరుడు పులిపాటి వెంకట శివయ్యను నంద్యాల టర్నింగ్ వద్ద సంచరిస్తుండగా అరెస్టు చేశారు. ఈ కేసులో మొదట రూ. 20 లక్షలు దుర్వినియోగంపై మొదట అటవీ శాఖ గుర్తించి కేసు నమోదు చేసింది. అయితే నిందితుడు చాంద్‌బాషా ఆ మొత్తాన్ని అటవీ శాఖకు తిరిగి చెల్లించాడు. కాగా విషయంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మొత్తం వ్యవహారాన్ని విచారణ చేసి చాంద్‌బాషా మొత్తం రూ.4,37,65,501ను తన సన్నిహితుల ఖాతాకు మళ్లించినట్లు తేలడంతో మరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో మరో ఐదుగురు నిందితులు ఉన్నారని, చాంద్‌బాషా ముందస్తు బెయిల్‌కు అప్పీల్ చేసుకోగా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అరెస్ట్ చేయవద్దని కోర్టు సూచించిందని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ రాము పాల్గొన్నారు.

చాతుర్మాస దీక్షలో పీఠాధిపతి



దీక్ష క్రతువులో పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు 13వ చాతుర్మాస దీక్ష స్వీకరించారు. మంగళవారం ఉదయం పూజామందిరంలో వేద మంత్రోచ్చారణలు, విశిష్ట పూజోత్సవాలు మధ్య దీక్ష చేపట్టారు. ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనంతో దీక్ష పదార్థాలకు పూజలు గావించారు. రాములోరి సంస్థాన పూజ చేపట్టి శాస్త్రోక్తంగా దీక్ష బూనారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్.కె. శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోన్నాపూర్ దీక్ష క్రతువులో పాల్గొన్నారు. 49 రోజుల పాటు స్వామిజీ దీక్షలో కొనసాగనున్నారు. ఆనవాయితీలో భాగంగా దీక్ష సమయంలో నియమావళి ప్రకారం ఆహారం, ఫలాలు, కూరగాయలు స్వీకరిస్తారు.

కూటమి ప్రభుత్వంలో మాకు విలువ ఎక్కడిది?

- మూడు రోజులు శిక్షణ తీసుకున్నా ఫలితం శూన్యం
- మహిళా జెడ్పీటీసీల ఆందోళన
- 27 మంది మహిళా జెడ్పీటీసీలలో ముగ్గురే హాజరు



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ముగ్గురు జెడ్పీటీసీలు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మండలాల్లో తమకు ఎలాంటి విలువ లేకుండా పోయిందని జెడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం కూటమి నేతలు చెప్పిందే వేదంగా మండల స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తున్నారని వాపోతున్నారు. తమకు విలువ లేని సమయంలో ప్రభుత్వం ఇస్తున్న శిక్షణ తీసుకున్నా, ఉపయోగం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. అందుకే శిక్షణకు హాజరు కాలేకపోతున్నామని చెబుతున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు స్థానిక జిల్లా పరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనంలో 'మార్పు ద్వారా విజేతలు – సాధికారతతో సుపరిపాలన సాధ్యం' అనే అంశంపై ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహిళా జెడ్పీటీసీలకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. మొదటి రోజైన మంగళవారం ఉదయం ప్రారంభమైన ఈ శిక్షణా తరగతులకు జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డితో ముగ్గురు మహిళా జెడ్పీటీసీలు (పగిడ్యాల నుంచి పి దివ్య, కృష్ణగిరి నుంచి కేఈ సుభాషిణి, నందికొట్కూరు నుంచి షేక్ కలీమున్నీసా) మాత్రమే హాజరయ్యారు. జెడ్పీ చైర్మన్‌తో కలిపి మొత్తం 53 మంది జెడ్పీటీసీలు ఉండగా, ఇందులో 27 మంది మహిళలు ఉన్నారు. వీరిలో తొలి రోజు శిక్షణకు కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పనిసరి పరిస్థితుల్లో శిక్షణను కొనసాగించాల్సి ఉన్నందున .. జ్యోతి ప్రజ్వలన చేసి డా.బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి శిక్షణను 'మమ' అనిపించారు. హాజరైన ముగ్గురు జెడ్పీటీసీలకు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి, రిసోర్స్ పర్సన్స్ కే రవికిశోర్, జీ నగేష్, టీ రాముడు పలు విషయాలపై కొద్ది సేపు అవగాహన కల్పించి శిక్షణా తరగతులను ముగించారు.

అందని గౌరవ వేతనాలపైనా పెదవి విరుపు ...

నిధులు లేకపోవడం, విధుల నిర్వహణలో అడ్డంకులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం జెడ్పీటీసీలకు ఇచ్చే గౌరవ వేతనాలను కూడా పెండింగ్‌లో పెట్టడం వల్ల కూడా జెడ్పీటీసీలు శిక్షణా తరగతులకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వనట్లు తెలుస్తోంది. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు 19 నెలలుగా జెడ్పీటీసీలకు గౌరవ వేతనాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఒక్కో జెడ్పీటీసీకి నెలకు రూ.6 వేల ప్రకారం 19 నెలలకు రూ.1.14 లక్షలను ప్రభుత్వం బకాయి పడింది. ఈ నేపథ్యంలోనే జెడ్పీ చైర్మన్‌ను మినహాయించి మిగిలిన 52 మంది జెడ్పీటీసీలకు ఈ నెలతో కలిసి రూ.59.28 లక్షలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అలాగే మరో ఏడాది మాత్రమే పదవీ కాలం ఉన్నందున ఇప్పుడు శిక్షణ తీసుకొని ఉపయోగమేంటనే భావనను కూడా పలువురు జెడ్పీటీసీలు వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ అందక భిక్షాటన



భిక్షాటన చేస్తున్న చిన్నగంగమ్మ

పేదల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం పల్లెల్లో పింఛన్లు కూడా అర్హులందరికీ ఇవ్వలేని స్థితిలో ఉంది. ప్రభుత్వం అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యంతో ఎంతో మంది అభాగ్యులకు పింఛన్ అందడం లేదు. వారిలో 80 ఏళ్ల వయస్సు పైబడిన ఈ వృద్ధురాలు ఒకరు. కుటుంబీకులందరినీ కోల్పోయి అనాథగా మిగిలింది. నిలువ నీడ లేక ఖాళీ స్థలంలో తాటాకులతో ఇరుగు పొరుగు వారు దయతలచి నిర్మించి ఇచ్చిన గుడిసెలో ప్రస్తుతం తల దాచుకుంటోంది. పూట గడిచేందుకు భిక్షాటన చేస్తోంది. మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఎస్టీ కాలనీకి చెందిన గాజుల చిన్న గంగమ్మకు అదే కాలనీకి చెందిన సుంకన్నతో వివాహమైంది. వీరికి సంతానం లేక పోవడం, అనారోగ్యంతో భర్త మరణించడంతో ఆమె సంజామల మండలం ఆకుమల్ల గ్రామంలో నివాసం ఉంటున్న సోదరి గంగమ్మ ఇంటిలో తలదాచుకుంది. ఆ సమయంలో ఒకే ఇంటిలో ఉన్న గంగమ్మకు పింఛన్ మంజూరు కావడంతో చిన్న గంగమ్మకు ఇవ్వలేదు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం గంగమ్మ మృతి చెందడంతో చిన్న గంగమ్మ తిరిగి చాగలమర్రి గ్రామానికి వచ్చి కాలనీలో బంధువుల ఇళ్ల వద్ద తల దాచుకుంటుంది. ఈ మేరకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉన్నా ఆమె సోదరికి గతంలో గంగమ్మకు పింఛన్ వస్తుందని ఇప్పటికీ అనాథ వృద్ధురాలికి పింఛన్ మంజూరు చేయలేదు. పలు మార్లు సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరిగినా ఆమె సమస్యను ఆలకించి పరిష్కరించిన అధికారి లేరు. పూట గడవక చివరకు భిక్షాటన చేస్తూ కాలం గడుపుతోంది. ఇప్పటికైన చిన్న గంగమ్మకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేసి జిల్లా కలెక్టరు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– చాగలమర్రి

క్లుప్తంగా

తపాలా శాఖలో బీమా ఏజెంటు పోస్టులు

కర్నూలు (న్యూటౌన్): తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా కర్నూలు డివిజన్‌లో పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు కొండారెడ్డి బురుజు వద్ద తపాలా శాఖ సూపరింటెండెంట్ కార్యాలయానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. 10వ తరగతి/ఆపై విద్యార్హత ఉండాలని, ఎంపికైన వారు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో చెల్లిస్తే తిరిగి వాపసు ఇస్తారని స్పష్టం చేశారు. ఎంపికైన పాలసీకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కమీషన్ చెల్లిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 70130 29312ను కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

యాస్పిరేషనల్ బ్లాక్‌లకు అవార్డులు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం

కర్నూలు(సెంట్రల్): సంపూర్ణ స్థాయిలో అభివృద్ధి సాధించిన యాస్పిరేషనల్ బ్లాక్‌లకు అవార్డులు అందించనున్నట్లు నీతి అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం చెప్పారు. ఆయన మంగళవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిపై కలెక్టర్లతో సమీక్షించారు. జూలై 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరుగనున్న సంపూర్ణత అభియాన్ సమ్మార్ సమా రోహ్ గురించి వివరించారు. నిర్దేశించిన ఆరు సూచికలు సాధించిన జిల్లాలకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో గవర్నర్, ప్రజాప్రతినిధుల సమక్షంలో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్‌బాషా, సీపీఓ హిమప్రభాకరరాజు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా

కర్నూలు(సెంట్రల్): అర్హులైన వారికి వెంటనే కొత్త పింఛన్లు మంజూరుచేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. వారు సోమవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్కటి కూడా కొత్త పింఛన్ మంజూరు చేయలేదన్నారు. ఫలితంగా అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రకాష్, విశ్వనాథ్, గోవర్ధన్, సాయి, కిరణ్, రఫీ పాల్గొన్నారు.

బయటకు చెప్పుకోలేక.. మోసాన్ని భరించలేక!

ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి

- మొదటి సారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రోడ్డెక్కిన పెన్షనర్లు
- కమిటేషన్ పేరుతో దోపిడీ చేస్తుండటంపై రగిలిపోతున్న పెన్షనర్లు
- ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి కొమ్ముకాస్తుండటం పట్ల ఆందోళన
- రూ.20వేల లోపు వేతనాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని సంక్షేమ పథకాలు
- ఐదు డీఏలు పెండింగ్, పీఆర్‌సీ లేదు, ఐఆర్ ఊసే కరువు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కక్కలేక, మింగలేక సతమతం అవుతున్నారు. ఉద్యోగుల పక్షాన పోరాటం చేసి ఆర్థిక ప్రయోజనాలు సాధించాల్సిన ఉద్యోగ సంఘాల నాయకులు కూటమి ప్రభుత్వ పెద్దల కు కొమ్ముకాస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా పెన్షనర్లు (విశ్రాంత ఉద్యోగులు) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రోడ్డెక్కుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పటై 13 నెలలు గడుస్తోంది. అయితే ఇప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బకాయిలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల పక్షాన ఏపీఎన్‌జీఓ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పోరాడాల్సి ఉంది. అయితే సంఘాలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండటం పట్ల ఉద్యోగుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ప్రభుత్వ తీరుపై ఆవేదనతో ఇటీవల రోడ్డెక్కిన పెన్షనర్లు

డిమాండ్‌లను సాధించుకోవడంలో పెన్షనర్లను చూసి నేర్చుకోవాలని ఆయా సంఘాల నేతలకు ఉద్యోగులు సూచిస్తుండటం గమనార్హం.

కమిటేషన్ పేరుతో దోపిడీ

కమిటేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం పెన్షనర్లను దోపిడీ చేస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు కమిటేషన్ తీసుకుంటారు. దీనిని అసలు, వడ్డీ సహా 15 ఏళ్లలో రికవరీ చేయాల్సి ఉంది. 11 ఏళ్ల 3 నెలల్లో ఈ మొత్తం రికవరీ పూర్తవుతుంది. అయితే 15 ఏళ్ల పాటు రికవరీ చేస్తుండటం పట్ల ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై కొన్ని నెలల క్రితం సుప్రీం కోర్టు కమిటేషన్ రికవరీ 11 ఏళ్ల 3 నెలలకే పూర్తి అవుతున్నందున 15 ఏళ్ల రికవరీ చేయరాదని ఆదేశాలు ఇచ్చింది. సుప్రీం కోర్టు ఆదేశాల తర్వాత ఐదారు నెలల పాటు కమిటేషన్ రికవరీని నిలుపుదల చేసింది. రెండు నెలలుగా ప్రతి ఉద్యోగి నుంచి స్థాయిని బట్టి రూ.4500 నుంచి రూ.8 వేల వరకు మళ్లీ రికవరీ చేస్తుండటం పట్ల పెన్షనర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది.

అరకొర బకాయిలే విడుదల

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదవుతున్నా ఉద్యోగుల బకాయిలకు ఒకసారి రూ.1300 కోట్లు, మరోసారి రూ.7200 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఇప్పటికీ దాదాపు రాష్ట్రం మొత్తం మీద బకాయిలు రూ.28 వేల కోట్ల వరకు ఉండిపోయాయి. ఇప్పటి వరకు విడుదల చేసింది మొత్తం బకాయిలో 10 శాతం మాత్రమే. ఈ మాత్రం దానికే ఉద్యోగ సంఘాల నేతలు మహదానంద పడిపోతుండటం పట్ల ఉద్యోగుల్లో సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు 27 శాతం మధ్యంతర భృతి చెల్లించారు.

8 నెలలుగా ఎదురుచూపులే..



ఉపాధ్యాయుడుగా కర్నూలు మండలం అంబేడ్కర్ పీఎస్‌హెచ్‌గా గత ఏడాది అక్టోబర్‌లో పదవీ విరమణ పొందాను. ఎనిమిది నెలలు గడచిపోయినా పూర్తి స్థాయిలో బెనిఫిట్స్ రాలేదు. ఇప్పటికీ గ్రాట్యూటీ రూ.16 లక్షలు పెండింగ్‌లో ఉంది. హాఫ్ పే లీవ్స్ బకాయిలు రూ.9 లక్షలు ఇవ్వాలి. వీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఇలా వేధించడం సరికాదు.

– జయరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు, మాజీ జనరల్ సెక్రటరీ, యూటీఎఫ్

ఇవీ సమస్యలు..

- కూటమి ప్రభుత్వం ఏర్పటై 13 నెలలు గడిచినప్పటికీ ఒక్క డీఏ కూడా చెల్లించని పరిస్థితి.
- 2024 మార్చి నాటికి ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదు. ప్రస్తుతం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండిపోయాయి.
- ఇప్పటి వరకు మధ్యంతర భృతి(ఐఆర్) ఊసే లేదు. 12వ పీఆర్‌సీ జాడ లేకుండా పోయింది.
- ఉద్యోగులు మరణించినప్పుడు మట్టి ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లిస్తారు. కూటమి ప్రభుత్వం ఈ సాంప్రదాయాన్ని పూర్తిగా పక్కన పెట్టినట్లు స్పష్టమవుతోంది.
- ఏపీజీఎల్ఐ చెల్లింపులు నిలిచిపోయాయి. జీపీఎఫ్, పీఎఫ్ ఊసే లేకుండా పోయింది.
- సరెండర్ లీవ్ బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉండిపోయాయి.
- కనీసం మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులు కూడా చెల్లించని పరిస్థితి.
- రూ.20 వేల లోపు వేతనాలు తీసుకుంటున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామనే హామీ ఇచ్చి విస్మరించారు.
- 2024 జూన్ తర్వాత పదవీ విరమణ పొందిన వారికి పెన్షన్ మినహా ఇతరత్రా ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వడం లేదు.
- 10 నెలల గ్రాట్యూటీ, కమిటేషన్ తదితరాలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.
- పదవీ విరమణ పొందిన ఒక్కో ఉద్యోగికి సగటున రూ.40 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయండి



ఉరుకుంద శ్రావణ మాస ఉత్సవాల ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాల ప్రారంభం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. ఈ నెల 25 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా ఆయన మంగళవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజుతో కలిసి ఆలయ ఆవరణలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయని, అన్ని శాఖల అధికారులతో పాటు గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల వారు సహాయ సహకారం అందించాలని కోరారు. ఉరుకుందకు వచ్చే నాలుగు వైపులా రోడ్లకు మరమ్మతులు చేశారా? అని ఆర్అండ్‌బీ ఏఈ సాయిసురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని డీసీని ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ కట్టను పరిశీలించి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. తాగునీటి ఏర్పాట్లపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. సీఐ అశోక్‌కుమార్, డిప్యూటీ కమిషనర్‌తో కలిసి నాలుగు వైపులా పార్కింగ్ స్థలాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. భక్తుల స్నానాల ఘాట్లను పరిశీలించారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తహసీల్దారు రజినీకాంత్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి, ముఖ్య అర్చకులు, ఆయాశాఖల అధికారులు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ లక్ష్య సాధనపై దృష్టి పెట్టండి



రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణికి స్వాగతం పలుకుతున్న జిల్లా రవాణా శాఖ అధికారులు

కర్నూలు: జిల్లా రవాణా శాఖకు కేటాయించిన ఆదాయ లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి జిల్లా రవాణా శాఖ అధికారులకు సూచించారు. త్రైమాసిక తనిఖీలో భా గంగా మంగళవారం ఆమె జిల్లా పర్యటనకు వచ్చారు. కర్నూలు మండలం తాంద్రపాడు గ్రామ శివారులో ఉన్న ఉప కమిషనర్ కార్యాలయానికి చేరుకోగానే డీటీసీ ఎస్.శాంతకుమారి, ఆర్‌టీఓ ఎల్.భరత్ చవాన్, ఏఓ వెంకట కుమార్ తది తరులు ఆమెకు పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో అధికారులతో సమావేశమై రవాణా శాఖ పురోగతిపై చర్చించారు. రికార్డులను పరిశీలించి లక్ష్యసాధనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. పన్ను వసూళ్లు, వాహనాల అమ్మకాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదతరా ల ద్వారా ఎంత ఆదాయం సమకూరింది, త్రైమాసిక పన్నులు సక్రమంగా వసూలయ్యాయా? పన్నులు చెల్లించకుండా తిప్పుతున్న వాహనదారులకు ఎంతమందికి నోటీసులు జారీ చేశారు, ఎన్ని వాహనాలు సీజ్ చేశారు తదితర అంశాలపై కూలంకుశంగా చర్చించారు. అలాగే రోడ్డు భద్రతపై శాఖాపరంగా తీసుకుంటు న్న చర్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఎంవీఐలు రవీంద్ర కుమార్, సుధాక ర్‌రెడ్డి, ఏఎంవీఐలు బాబు కిషోర్, గణేష్ బాబు సమావేశంలో పాల్గొన్నారు.

నేడు నంద్యాల...

జిల్లాలో ఐదు రవాణా శాఖ కార్యాలయాలు ఉండగా.. మొదటి రోజు కర్నూలు, ఆదోని కార్యాలయాల్లో ఆమె తనిఖీలు పూర్తి చేశారు. నంద్యాలలో ఆర్‌టీఓ కార్యాలయం,డోన్, ఆత్మకూరులో ఎంవీఐ కార్యాలయాలు ఉ న్నాయి. బుధవారం ఆయా కార్యాలయాల్లో కూడా తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కోలుకోలేక రైతు మృతి



రామాంజనేయులు (ఫైల్)

చిప్పగిరి: పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దొల్లాపురం గ్రామానికి చెందిన కావలి రామాంజనేయులు (55)కు భార్య పుల్లమ్మ, కుమారుడు మహేష్‌తో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పిల్లల చదువుల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు రామాంజనేయులు కుటుంబ సభ్యులకు తెలియకుండా తమకున్న 15 ఎకరాల్లో మూడెకరాలను చిప్పగిరికి చెందిన వారికి రూ.15 లక్షలకు విక్రయ అగ్రిమెంటు రాసి ఇచ్చి అడ్వాన్సుగా రూ.5 లక్షలు తీసుకున్నాడు. పొలం అమ్మడం కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోవడం, క్రయవిక్రయాల్లో తేడాలు రావడంతో మనస్థాపానికి గురై ఆదివారం పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా పురుగు మందు తాగినట్లు గుర్తించి గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు తెలిపారు.

కూతురిని వేధిస్తున్నారని కత్తితో దాడి

నంద్యాల: కూతురి వెంట పడుతూ వేధిస్తున్నారని ఇద్దరు మైనర్ బాలురుపై తండ్రి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన నంద్యాలలో మంగళవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన మైనర్ బాలికను విశ్వనగర్‌కు చెందిన ఇద్దరు మైనర్ బాలురులు గత కొన్ని రోజులుగా వేధిస్తున్నారు. బాలిక వెంట పడటం, తరచూ ఇంటి వద్ద తిరుగుతూ అల్లరి పట్టిస్తుండటంతో విషయాన్ని కూతురు తన తండ్రికి తెలిపింది. గత కొన్ని రోజులుగా వారి ఆకతాయి చేష్టలను గమనిస్తూ వస్తున్న తండ్రి మంగళవారం సాయంత్రం తన ఇంటి ముందు తిరుగుతున్న ఇద్దరు మైనర్ బాలురులపై కత్తితో దాడి చేశాడు. ఘటనలో ఇద్దరు మైనర్ బాలురులకు తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ భజన తప్ప ప్రజా సంక్షేమం ఏదీ?

- ప్రభుత్వానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రశ్న



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీకి భజన చేస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మండిపడ్డారు. నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం.. డోన్‌లో జరిగే సీపీఐ నంద్యాల జిల్లా రెండవ మహాసభ పోస్టర్లను ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, రామాంజనేయులు, సుంకన్న, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, రాధాకృష్ణ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈనెల 30, 31 తేదీల్లో డోన్‌లో జరిగే సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈనెల 24, 25వ తేదీల్లో వివిధ దేశాల నుంచి కమ్యూనిస్టు నాయకులతో విజయవాడలో అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి ఇప్పుడు అవే స్మార్ట్ మీటర్లను అదానీ కాంట్రాక్టర్లతో ప్రజలకు అంటగట్టేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. సాగు నీటి ప్రాజెక్టులపై స్పష్టత లేదని, సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. అలగనూరు రిజర్వాయర్‌కు నిధులను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. సీపీఐ నాయకులు శ్రీనివాసులు, నాగరాముడు, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలు సత్వరం సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ కే.శ్రీనివాసులు

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు సకాలంలో సూక్ష్మ సేద్యం పరికరాలు సరఫరా చేయడంతో పాటు వాటిని వెంటనే అమర్చాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసులు డ్రిప్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో డ్రిప్ కంపెనీల జిల్లా కో–ఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26లో 7వేల హెక్టార్లకు డ్రిప్ సదుపాయం కల్పించాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 591 హెక్టార్లకు డ్రిప్ మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు ఇచ్చామన్నారు. కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజక వర్గాలకు ఫిబ్రవరిలోపు 2500 హెక్టార్లకు డ్రిప్ పరికరాలు అమర్చాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన పరికరాలు, మెటీరియల్ సరఫరా చేయాలని సూచించారు. ఈ ఏడాది ఐదు ఎకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీతో డ్రిప్ మంజూరు చేస్తామన్నారు. ఏపీఎంఐపీ అదనపు పీడీ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ అన్ని కంపెనీలు నాణ్యమైన పరికరాలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఉద్యాన అధికారులు మదన్ మోహన్‌గౌడు, నరేష్‌కుమార్‌రెడ్డి, ఎంఐ ఇంజనీర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నతుంబళంలో చోరీ

పెద్దకడుబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బుడిజగ్గుల ఈరన్న మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో చర్చి ప్రారంభోత్సం ఉన్నందున శనివారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అక్కడ కార్యక్రమం ముగించుకొని సోమవారం ఇంటిని చేరుకున్నాడు. ఇంటికి వేసి ఉన్న తాళం తెరిచి ఉండడం గమనించాడు. ఇంట్లో వెళ్లి చూడగా 2తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపాడు.

మట్కా బీటర్ అరెస్టు

మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన కురువ మహాదేవ మట్కారాస్తూ పట్టుబడినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిందితుడు మట్కా రాస్తూ, కర్ణాటక టెట్రా ప్యాకెట్లు కూడా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి పట్టుకున్నామన్నారు. అతని వద్ద 30 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, రూ. వెయ్యి నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.


శ్రీమఠంలో 13వ చతుర్మాస సంబరాలు



పీఠాధిపతికి తులభారం నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయం: శ్రీమఠంలో మంగళవారం 13వ చతుర్మాస దీక్ష మహోత్సవ శుభసందర్భంగా శ్రీమఠం కారిడార్‌లో అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం హరికథాంబ్రుత పారియణ సేవసమితి ఆధ్వర్యంలో దాససాహిత్యంపై ధార్మిక క్విజ్ పోటీలు నిర్వహించారు. శ్రీమఠం పీఠాధిపతి సుభు దే ంద్ర తీర్థస్వామిజికి నాణ్యాలు, బియ్యం, పప్పు గోపిచందన వంటి వివిధ పవిత్ర వస్తువులతో కూడిన పుష్పరుష్టితో తులభారం నిర్వహించారు.

షూటింగ్ సందడి





బిళ్ల సర్గం గుహల వద్ద సినిమా షూటింగ్ చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) అటవీ నేపథ్యంలో సన్నివేశం చిత్రీకరణ



షూటింగ్ కోసం వేసిన గుడిసెలు



షూటింగ్ స్పాట్ వద్ద నటీనటులు

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమ కింది కొట్టాల గ్రామ సమీపాన ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన బిళ్ల సర్గం గుహల వద్ద మంగళవారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. హైదరాబాద్‌కు చెందిన సినిమా బృందం సత్యదేవ్ హీరోగా తెరకెక్కిస్తున్న సినిమాకు సంబంధించి చిత్రీకరణ జరుపుతోంది. ఇందుకోసం వేసిన సెట్టింగ్‌లు, తాత్కాలిక గుడిసెలు, నటీనటుల మేకప్, సినీ సరంజామా, ఆర్టిస్టులు, పర్యాటకులతో సందడి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బిళ్ల సర్గం గుహల అభివృద్ధికి పర్యాటక శాఖ తరపున రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో గుహలలో ఫుట్‌పాత్ వే తో పాటు లైటింగ్, రెస్టారెంట్, టాయిలెట్ బ్లాక్స్ ఏర్పాటు చేశారు. పనులు పూర్తయిన తర్వాత 2024 జనవరి 29 నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో పర్యాటకుల సంఖ్య పెరగడమే గాకుండా సినిమా షూటింగ్‌లకు సైతం అనుకూలంగా మారింది. గతేడాది రాచరికం సినిమా, ప్రస్తుతం రెండో సినిమా షూటింగ్ జరుగుతుండటంతో బిళ్ల సర్గం గుహల వద్ద సందడి నెలకొంది.